

# దాడి సిగ్గుచేటు

కాల్వశ్రీరాంపూర్: చెప్యాల పవన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాల్వశ్రీరాంపూర్‌లో చెప్యాల పవన్ కుటుంబానికి, వరద బాధితులకు పరామర్శ

పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ)/ కాల్వశ్రీరాంపూర్: ఖమ్మం జిల్లాలోని వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బృందంపై కాంగ్రెస్ నాయకులు గూండాల్లాగా దాడులు చేయడం సరికాదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తప్పుపట్టారు. దాడి చేయడం హేయమైన చర్య అని, సిగ్గుచేటని ఖండించారు. దీనిని ప్రపంచం ఒప్పుకోదని విమర్శించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్మార్గపు ఘటనలు మరోసారి పునరావృతమైతే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్ మండలం కొత్తపెల్లి నక్కల ఒర్రె వరదలో చిక్కుకుని మృతి చెందిన కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి ఆయన మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వరదల్లో మృతిచెందిన వ్యక్తులకు ₹25 లక్షల పరిహారం ఇవ్వాలని ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా డిమాండ్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడేమో కేవలం ₹5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వరదల్లో చిక్కుకుని మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ₹25 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విపత్తు జరిగితే అక్కడి ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తమై చర్యలు తీసుకుంటే, రాష్ట్రంలోని మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రయోజనం శూన్యమని, వరదల్లో 24 మంది చిక్కుకుంటే కనీసం హెలీక్యాప్టర్ పెట్టక పోవడం శోచనీయమన్నారు. ఖమ్మం, జనగామ, హైదరాబాద్, కామారెడ్డిలో వరదలు వస్తే ప్రభుత్వ స్పందన కరువైందని విమర్శించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, బీఆర్‌ఎస్ నాయకులు తాత సాయికిరణ్, దేవయ్య, సువర్ణ బిట్టు, పుప్పాల నాగార్జునరావు, కొల్లూరి రాయమల్లు, మాదాసి రాంచంద్రం, సారంగపాణి ఉన్నారు.

నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | PEDDAPALLI

## నీచ సంస్కృతికి నిదర్శనం




జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 3 : ఖమ్మం వరద ప్రాంతాల్లో పర్యటించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు ఇతర మాజీ మంత్రులపై రాళ్లదాడికి పాల్పడడం హేయమైన చర్య అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. వరదలు తగ్గినా బాధితులకు సహాయం అందించచడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుతుతున్నారని, వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే ప్రభుత్వం సాయం శూన్యమని విమర్శించారు. హరీశ్‌రావు ప్రశ్నలకు సమాధానం చెప్పే స్థితిలో లేక పంటల నష్టం పరిశీలనలో ఉన్న ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావుపై కాంగ్రెస్ నాయకులు గుండాలతో రాళ్లు విసిరించి దాడులకు దిగారని, ఇది కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. దాడుల సంస్కృతిని విరమించుకోవాలని, లేని పక్షంలో కేసీఆర్ న్యాయకత్వంలో తమ పార్టీ కార్యకర్తలు తిరగబడితే తట్టుకోలేరని హెచ్చరించారు.

# రాష్ట్రంలో గూండా సంస్కృతి

కాంగ్రెస్ దాడిపై మండిపడ్డ గంగుల కమలాకర్



కరీంనగర్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిహార్ గూండా సంస్కృతిని అమల్లోకి తెస్తున్నదని, మంగళవారం ఖమ్మంలో బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, నాయకులపై జరిగిన దాడి దీనికి నిలువెత్తు నిదర్శమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. విపత్తు కాలంలో చేయూతనివ్వడానికి వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ మంత్రులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో విఫలమైన నేపథ్యంలోనే తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందని, వీటిని స్వాగతించాల్సిన కాంగ్రెస్ జీర్ణించుకోకుండా దాడికి పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తి వ్యతిరేకమన్నారు. ప్రజాస్వామ్య వాదులు ఈ నీచమైన చర్యను ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఇలా దాడులకు పూనుకుంటూ దేశ ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రశాంతమైన తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విపత్తును ఎదుర్కొనే సామర్థ్యం లేక, ప్రజలకు సౌకర్యాలు అందించలేక విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వమే గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నట్టు అనిపిస్తుందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ ఇలాంటి దాడులు చూడలేదని చెప్పారు.

# మాజీ మంత్రులపై దాడి నీచమైన చర్య

బీఆర్‌ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు



కరీంనగర్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం జిల్లాకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావుపై కాంగ్రెస్ గూండాలు రాళ్ల దాడి చేయడం నీచమైన చర్య అని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వరదలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయి అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి సహా ఎవరూ పట్టించుకోకపోవడంతో బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలు బాధితులను పరామర్శించేందుకు వెళ్లడం తప్పా? అని ప్రశ్నించారు. వరదలు తగ్గు ముఖం పట్టినా బాధితులకు సహాయం అందించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ అక్కసునంతా ప్రతిపక్షాలపై చూపుతున్నారని మండిపడ్డారు. బాధితుల పక్షాన ప్రతిపక్ష పార్టీగా వారి గోడును వినిపించే హక్కు ఉంటుందని, పరామర్శకు వెళ్లి, వారి బాధలు తెలుసుకుంటే ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందని కాంగ్రెస్ గూండాలు నీచాతి నీచంగా రాళ్ల దాడికి దిగడం హేయమైన చర్యఅని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని, విచక్షణ లేకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న కాం గ్రెస్ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులకు దిగి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు.

## కొండగట్టు తలనీలాల టెండర్ 13న

మల్యాల, సెప్టెంబర్ 3: కొండగట్టు అంజన్న క్షేత్రంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాది కాలం పాటు పోగు చేసుకునేందుకు ఈ నెల 13న హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు తెలిపారు. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు ఏడాది కాలానికిగాను టెండర్ కం బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ-టెండర్ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నెలరోజులపాటు పోగు చేసిన తలనీలాలను సైతం ఎక్కువ పాట పాడిన వారికి అప్పగిస్తామన్నారు. టెండర్‌లో పాల్గొనేవారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491000653, 9440349573, 9963803471లో సంప్రదించాలని సూచించారు.

'ఎత్తిపోయరు.. ఎగువన నింపరు' అన్నట్టున్నది కాంగ్రెస్ సర్కారు తీరు! 'చెర్ల నీళ్లు చెరువెనుకాల పడ్డట్టు' ఇప్పుడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాలను సముద్రంపాలు చేయడం అలాగే ఉన్నది. అల్పపీడన ప్రభావంతో వచ్చిన వర్షపు నీటిని ఒడిసి పట్టి ప్రాజెక్టులను నింపుకునే అవకాశమున్నా.. ఏమాత్రం ఆలోచన లేకుండా వదిలేయడం ప్రభుత్వ ప్రణాళికాలోపానికి అద్దం పడుతున్నది. నిజానికి వర్షాలు వెనక్కి తగ్గి ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో తగ్గితే.. పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారే ప్రమాదమున్నది.

- ప్రభుత్వ ప్రణాళికా లోపంతో ఎస్సారెస్పీ నీరు సముద్రంపాలు
- అన్నపూర్ణ నుంచి అంతంత మాత్రంగా సాగుతున్న ఎత్తిపోతలు
- నాలుగు మోటర్ల స్థానంలో రెండింటినే నడుపుతున్న సర్కారు
- ఇలా అయితే మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిండేదెన్నడు?
- ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలకు చేరేదెప్పుడు?
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ ప్రాజెక్టులు నింపలేని దుస్థితి



# ఎత్తిపోయరు.. ఎగువన నింపరు?

కరీంనగర్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాలుగైదు రోజుల క్రితం వరకు గోదావరికి ఎగువన వర్షాలు లేకపోవడం.. తద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అంచనాలకు అనుగుణంగా వరద రాకపోవడంతో కాళేశ్వరం జలాలను కొండపోచమ్మ సాగర్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన విషయం తెలిసిందే. ఎల్లంపల్లి-మధ్యమానేరు-అన్నపూర్ణ రిజర్వాయర్-రంగనాయకసాగర్ ద్వారా పైన ఉన్న మల్లన్నసాగర్, కొండపోమ్మసాగర్ ప్రాజెక్టులకు కొద్ది రోజులుగా ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం వల్ల గోదావరికి భారీ వరద రావడంతో తద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. శ్రీరాంసాగర్‌లో సిల్ట్ పేరుకుపోయిన తర్వాత ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, మంగళవారం సాయంత్రం ఆరు గంటలవరకు 70 టీఎంసీల నీరున్నది. కాగా 2,42,616 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 41 గేట్లు ఎత్తి 2,59,928 క్యూసెక్కులను గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. నిజానికి ఎస్సారెస్పీ దిగువన ఉన్న శ్రీరాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 21 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎస్సారెస్పీ నుంచి గడిచిన 24 గంటలుగా వరదకాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 7 టీఎంసీల నీరు అవసరమున్నది. అలాగే, మధ్యమానేరు దిగువన ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, అందులో 16 టీఎంసీలు మాత్రమే ఉన్నది. ఈ ప్రాజెక్టు నిండాలంటే.. దాదాపు ఇంకా 8 టీఎంసీలు కావాలి. దీంతోపాటు మధ్యమానేరు నుంచి మూడు టీఎంసీల సామర్థ్యమున్న మల్కాపూర్ రిజర్వాయర్‌కు నీరు ఎత్తిపోసి అక్కడి నుంచి చెరువులను నింపొచ్చు.

నీటిని ఒడిసి పట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత కరువైంది. అల్పపీడన ప్రభావంతో పడుతున్న వర్షపు నీటిని రాష్ట ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎత్తిపోసుకోవడంలో ప్రణాళికాలోపం కనిపిస్తున్నది. దీనికి నిలువెత్తు నిదర్శనమే మధ్యమానేరు-అన్నపూర్ణ జలాశయం నుంచి కొండపోచమ్మ సాగర్‌కు అంతంతే కొనసాగుతున్న ఎత్తిపోతలు! ఓ వైపు రోజుకు దాదాపు 25 టీఎంసీలకు పైగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు సముద్రం పాలవుతున్నా.. దిగువన ప్రాజెక్టులను నింపడంలోనూ.. అలాగే కొండపోచమ్మసాగర్ వరకు ఎత్తిపోయడంలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం బయటపడుతున్నది. ఒకవేళ శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో ఆగితే.. ప్రభుత్వం అలసత్వం వల్ల ఎత్తిపోతలు లేక రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి మారుతుంది.

### అన్నపూర్ణ నుంచి ఎత్తిపోతలు అంతంతే

నిజానికి ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీరు సముద్రం పాలవుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రణాళికాలోపం స్పష్టంగా కనిపిస్తున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ముందుగా మధ్యమానేరుకు వరదకాలువ ద్వారా ఇవ్వొచ్చు. వరదకాలువ నుంచి 22 వేల క్యూసెక్కుల నీటిని మధ్యమానేరుకు విడుదల చేసే అవకాశం ఉన్నా ప్రస్తుతం 12 వేలకు మించి ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే వచ్చిన నీటిని వచ్చినట్టుగా మధ్యమానేరు నుంచి అన్నపూర్ణకు అక్కడి నుంచి రంగనాయకసాగర్-మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు ఎత్తిపోసుకోవచ్చు. పుష్కలమైన నీరున్నా.. ఎత్తిపోతల్లో మాత్రం ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి అన్నపూర్ణ రిజర్వాయర్ వద్ద 4 పంపులున్నాయి. ఒక్కో పంపు నుంచి 3200 క్యూసెక్కులు ఎత్తిపోవచ్చు. అంటే నాలుగు పంపుల ద్వారా 12,800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే అవకాశమున్నది. కానీ, కొద్దిరోజులుగా అన్నపూర్ణ జలాశయం వద్ద కేవలం రెండు పంపులు మాత్రమే నడుపుతూ 6,200 క్యూసెక్కులను మాత్రమే ఎత్తిపోస్తున్నారు. ఇదే పద్ధతి రంగనాయకసాగర్ వద్ద కొనసాగుతున్నది. నీరు ఉన్నప్పుడు ఎక్కువ మోటర్లు నడిపి తద్వారా ఎక్కువ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఈ దిశగా దృష్టిపెట్టడం లేదు. ఇలాగైతే మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిండేదెలా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మల్లన్నసాగర్ పూర్తి సామర్థ్యం 50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.65 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గడిచిన వారం రోజుల్లో రంగనాయకసాగర్ నుంచి కేవలం 3.05 టీఎంసీలను మాత్రమే మల్లన్నసాగర్‌కు ఎత్తిపోశారు. ఈ లెక్కన ప్రస్తుత పరిస్థితి అంటే.. దాదాపు 39 టీఎంసీల నీరు ఈ ప్రాజెక్టు నిండేందుకే కావాలి. అలాగే, కొండపోచమ్మ సాగర్ పూర్తిసామర్థ్యం 15 టీఎంసీలు కాగా, కొద్దిరోజులుగా ఈ ప్రాజెక్టుకు కేవలం 1.5 టీఎంసీల నీటిని మాత్రమే ఎత్తిపోశారు. నిజానికి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపుకోవడమేకాదు, ఈ ప్రాజెక్టుల ద్వారా దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని 95 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నింపుకొని లక్షా 25 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఆస్కారమున్నది.

### ఆగిపోతే ఏమిటీ పరిస్థితి?

దీపం ఉన్నప్పుడే ఇంటిని చక్కబెట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అన్నపూర్ణ జలాశయం నుంచి నాలుగు మోటర్లు ఆన్‌చేసి నీటిని పూర్తిస్థాయిలో కొండపోచమ్మ సాగర్‌కు ఎత్తిపోవడంలో ప్రణాళికాలోపం స్పష్టంగా కనిపిస్తున్నది. దీని వల్ల శ్రీరాంసాగర్ జలాలు గోదావరి పాలవుతున్నాయి. నిజానికి శ్రీరాంసాగర్ జలాలను ఒడిసి పట్టుకునే అంశంపై ప్రభుత్వం శ్రద్ధపెడితే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నందిమేడారం- గాయత్రీ పంపుహౌస్, మధ్యమానేరు వరకు ఎత్తిపోసుకునే ఇబ్బందులు ప్రస్తుతం తప్పుతాయి. అంతేకాదు, ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరు, లోయర్‌మానేరు ప్రాజెక్టులకు బై గ్రావిటీ ద్వారా కావాల్సిన నీరు తీసుకోవడానికి ఆస్కారం ఉన్నది. మధ్యమానేరు ప్రాజెక్టుకు కావాల్సినంత నీరు తీసుకోవడానికి వరదకాలువను పూర్తిగా వినియోగించుకోచ్చు. వరదకాలువ ద్వారా రోజుకు 22 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ నుంచి తీసుకోవడానికి అవకాశం ఉన్నది. అంటే దాదాపు రోజుకు రెండు టీఎంసీల నీరు తీసుకోవచ్చు. అలాగే, ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ ద్వారా రోజుకు 9 వేల క్యూసెక్కుల నీటిని నేరుగా లోయర్‌మానేరుడ్యాంకు సరఫరా చేయవచ్చు. తద్వారా ఎల్ఎండీ దిగువన అంటే బీలో ఎల్ఎండీ పరిధిలోని దాదాపు 900 చెరువులు కుంటలు నింపుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అల్పపీడన ప్రభావంతో అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటే లక్షలాది మంది రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి సాధ్యమైనంత మేరకు గ్రావిటీ ద్వారా నీటిని వాడుకునే వెసలుబాటు దొరికినట్లు అయ్యేది. గ్రావిటీ ద్వారా రావాల్సిన నీటిని తీసుకోవడంలోనూ అస్పష్ట విధానం కొనసాగుతుండగా.. మరోవైపు ఎత్తిపోతలు అలాగే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం అన్నపూర్ణ జలాశయం నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు కేవలం రెండు మోటర్ల ద్వారా 6,200 క్యూసెక్కులను మాత్రమే ఎత్తిపోస్తున్నారు. ఇలా అయితే 50 టీఎంసీల మల్లన్నసాగర్ నిండేది ఎలా..? అలాగే 15 టీఎంసీల సామర్థ్యమున్న కొండపోచమ్మ ఎప్పుడు నిండాలె.. తిరిగి అక్కడి నుంచి మూడు జిల్లాల చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎప్పుడు నిండాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే ఎస్సారెస్పీ నీటిని గ్రావిటీ ద్వారా మధ్యమానేరు, దిగుమానేరు ఇస్తూ.. వాటి పరిధిలోని చెరువులు, కుంటలు నింపే విషయంలో ఒక ప్రణాళికాబద్ధంగా వ్యవరించడంతో పాటు ఇదే సమయంలో మధ్యమానేరు-అన్నపూర్ణ జలాశయం నంచి కొండపోచమ్మ వరకు వీలైనంత ఎక్కవ నీటిని ఎత్తిపోసుకునేందుకు అన్ని మోటర్లను నడుపాలన్న డిమాండ్ వస్తున్నది. నిజానికి వర్షాలు వెనక్కి తగ్గి శ్రీరాంసాగర్‌కు వచ్చే ఇన్‌ఫ్లో తగ్గితే.. ప్రస్తుతం ఉన్న అన్ని అవకాశాలను కోల్పోయే పరిస్థితులు తలెత్తడమేకాదు, దీని వల్ల ఈ ఆయకట్టు రైతుల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారే ప్రమాదమున్నది.

# రాజన్న శ్రావణ ఆదాయం @ ₹6.87 కోట్లు

నెలంతా జనశోభితం..
మొత్తం 4.50 లక్షల మందికిపైనే రాక



వేములవాడ టౌన్, సెప్టెంబర్ 3 : శ్రావణం మాసం సందర్భంగా భక్తులు వేములవాడ రాజరాజేశ్వర సన్నిధికి పోటెత్తారు. శుభ దినాలు ఎక్కువగా ఉన్న ఈ నెలలో శివున్ని ఆరాధిస్తే పుణ్యం సిద్ధిస్తుందని భావించి, క్యూ కట్టారు. మన జిల్లా, రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వెల్లువలా తరలివచ్చారు. ముఖ్యంగా ఆది, సోమ, శుక్రవారాల్లో వేలాదిగా బారులు తీరారు. గంటల తరబడి మరీ లైన్లలో నిల్చొని రాజన్నను దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకుని, తలనీలాలు సమర్పించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలంటూ వేడుకొన్నారు. మొత్తంగా నెల రోజుల్లో 4.50 లక్షల మందికిపైనే రాగా, రాజన్నకు మొత్తం ₹6,87,22,090 ఆదాయం సమకూరినట్టు ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. అందులో అభిషేకం టికెట్ల ద్వారా ₹21,16,500, కల్యాణ టిక్కెట్ల ద్వారా ₹34,44,000 కేశఖండనం 1,2 కౌంటర్ల ద్వారా ₹15,22,700, కొబ్బరికాయలు, బెల్లం అమ్ముకునే లైసెన్సు ద్వారా ₹10,47,458, గండదీపం టికెట్ల ద్వారా ₹1,09,560, ధర్మశాలల కిరాయిల ద్వారా ₹43,80,497, ప్రత్యేక కోడెమొక్కు బడి టికెట్ల ద్వారా ₹1,74,76,600, లడ్డూ ప్రసాదాల ద్వారా ₹1,35,81,500, బ్రేక్ దర్శనం ద్వారా ₹12,33,000, శాశ్వత కల్యాణాల ద్వారా ₹1,40,000, శాశ్వత పూజల ద్వారా ₹1,69,362, బద్దిపోచమ్మ ఆలయ సేవల టికెట్ల ద్వారా ₹9,92,195, భీమేశ్వరాలయం సేవల టికెట్ల ద్వారా ₹3,06,720, సత్యనారాయణ వ్రత టికెట్ల ద్వారా ₹1,86,000తో పాటు ఇతర సేవల ద్వారా ఆదాయం సమకూరిందని వెల్లడించారు. శ్రావణమాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆలయానికి వచ్చిన భక్తులు సంతృప్తిగా స్వామివారిని దర్శించుకుని వెళ్లారని ఈవో తెలిపారు.






సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి ఆర్థిక సాయం అందజేస్తున్న సాయిసింధు

## వరద బాధితులకు నేను సైతం

సీఎం సహాయనిధికి ₹3వేలు అందించిన బాలిక

మహబూబాబాద్ రూరల్ : వరద ముంపు బాధితులను ఆదుకోవాలనే ఆలోచనతో పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు గొప్ప మనసు చాటుకున్నది. తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న ₹3వేలను మంగళవారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందించింది. ఈ సందర్భంగా సీఎం సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ బాలికను అభినందించారు.



గతేడాది భారీ వర్షాలతో మునిగిన వెలిచాల- కొత్తపల్లి మధ్య రొడ్డాం

అందుబాటులోకి వచ్చిన కొత్త వంతెన



# వెలిచాల వాసుల కష్టాలు తీరినయ్..

రామడుగు, సెప్టెంబర్ 3 : రామడుగు మండలంలోని వెలిచాల గ్రామస్తులు ఇన్నేండ్లు అనుభవించిన కష్టాలు గట్టెక్కాయి. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు చేసిన కృషితో అతి తక్కువ సమయంలో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తయింది. వెలిచాల గ్రామస్తులు నిత్యం అనేక పనులమీద కొత్తపల్లి మీదుగా కరీంనగర్ వెళ్తుంటారు. కాగా, వానకాలం పైనుంచి వచ్చే వరదనీరు వెలిచాల-కొత్తపల్లి మధ్యన ఉన్న రోడ్డాం(కల్వర్టు) ద్వారా కొత్తపల్లి చెరువులోకి చేరుకుంటుంది. అయితే, కల్వర్టు తక్కువ ఎత్తులో ఉండడంతో వరద ఉధృతికి కొన్ని రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయేవి. అంతేకాకుండా, జగిత్యాల బైపాస్ సైతం ఇదే రోడ్డు కావడంతో భారీ వాహనాలు సైతం ఎక్కడివక్కడే నిలిచిపోయేవి. దీంతో వీర్ల వెంకటేశ్వరరావు గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేసిన ప్రస్తుత కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కలిసి ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన అప్పుడు రూ.4.40 కోట్లు మంజూరు చేయించి, గతేడాది మే 13న భూమిపూజ చేశారు. గుత్తేదారు గతేడాది డిసెంబర్ 23న పనులు ప్రారంభించి కేవలం ఆరు నెలల్లోనే వంతెన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

